## క్లుప్తంగా

### వెంకటరత్నం నాయుడికి ఘన నివాళి


రఘుపతి వెంకటరత్నం నాయుడి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

**కాకినాడ రూరల్:** సంఘ సంస్కర్త, బ్రహ్మ సమాజానికి ఆద్యుడు రఘుపతి వెంకటరత్నం నాయుడి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానం వద్ద ఆయన విగ్రహానికి సోమవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మెడికల్ అండ్ ఎడ్యుకేషనల్ మాజీ డైరెక్టర్ ఎం.రాఘవేంద్రరావు మాట్లాడుతూ 1904లో పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటరత్నం నాయుడు పనిచేశారని, 1911లో మహిళలకు కళాశాలలో చదువుకునే అవకాశం కల్పించి కోఎడ్యుకేషన్‌కు ఆద్యుడయ్యాడన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, సూర్యనారాయణ, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సురక్షిత పద్ధతులతో అధిక దిగుబడి

**బోట్‌క్లబ్:** సురక్షిత పద్ధతులు పాటిస్తే ఆక్వా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఎస్ఐఎస్ కంపెనీ కన్సల్టెంట్ లక్కరాజు సత్యనారాయణన్ అన్నారు. స్థానిక ఓ హోటల్లో సోమవారం మేలైన పద్ధతుల్లో ఆక్వా సాగుపై ప్రంప్ ఇంప్రూమెంట్ సిష్టం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్ఐఎస్ కంపెనీ టెక్నికల్ హెడ్ నానంగ్ హిందాల్తో పలు అంశాలు తెలిపారు. పామ్ డేటా ఎనలిస్ట్ రిషి, శివప్రసాద్, ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కవితా పండగ పోస్టర్ ఆవిష్కరణ


కవితా పండగ, కవి సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూకేలో వీసీ ప్రసాద్

**బోట్‌క్లబ్:** శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో వచ్చే నెల 22న కాకినాడ పీఆర్ కళాశాల్లో గోదావరి కవితా పండగ, కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక జేఎన్‌టీయూకేలో సోమవారం వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన కత్తిమండ ప్రతాప్ సేవలను ప్రశంసించారు. కళావేదిక రాష్ట్ర కార్యదర్శి అమ్మకవి కొండేపూడి తాతబ్బాయి మాట్లాడుతూ ఏ కవి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వారికి కావాల్సిన వసతి, ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రాము, సభ్యులు కె.ప్రసన్నకుమార్, తురగా సూర్యారావు, సూరంపూడి సూర్యనారాయణ, వేదుల శ్రీరామ్ శర్మ పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

**బోట్‌క్లబ్:** ఎస్వీ రంగారావు కళాస్రవంతి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పేపకాయల రామకృష్ణ, అధ్యక్షుడిగా పసుపులేటి జె.చంటిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మోటిపల్లి నాగేశ్వరరావు, గళ్లా పద్మారావు, సీహెచ్ అలెక్స్, కార్యదర్శిగా ఎల్.నటకుమారి, పిడుగు రవికుమార్, సహాయ కార్యదర్శిగా వెంపటి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకన్నబాబు, ట్రెజరర్‌గా పేర్నీడి స్వామితో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్వీ రంగారావు కళాస్రవంతి 11వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 1న దంటు కళాక్షేత్రంలో సర్వసభ్య సమావేశం, 2న సేవా కార్యక్రమాలు, 3న రాష్ట్ర స్థాయి నాటికలు ప్రదర్శిస్తామని ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు తెలిపారు.


అధ్వానంగా మారిన దమ్ములపేట నుంచి కుంభాభిషేకం రోడ్డు


సంక్రాంతికి ముందు ఇలా మరమ్మతులు (ఫైల్)

# రహదారుణం

- అధ్వానంగా కుంభాభిషేకం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు, ప్రజలు

**కాకినాడ రూరల్:** అక్కడక్కడా రోడ్డు, అంతా గుంతలే అన్నట్లు ఉంది.. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు ఏడాది అవుతున్నా రహదారుల అభివృద్ధి మాటేలేదు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే రహదారులను బాగు చేస్తామంటూ ఊకదంపుడు ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు క్షేత్ర స్థాయిలో రోడ్ల గుంతలు, గతుకులను తలపిస్తున్నా పట్టించుకోవడం లేదు. సంక్రాంతికి ముందు ఆర్భాటంగా చిన్నపాటి మరమ్మతులు చేశారు. నేటికీ రోడ్ల దుస్థితి మార్చలేదు. కాకినాడ అర్బన్, రూరల్ ప్రాంతాల ప్రజలతో పాటు మత్స్యకారులు సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులతోపాటు కుంభాభిషేకం ఆలయం, రేవు, మెరైన్, కోస్ట్ గార్డు స్టేషన్లకు వెళ్లే ప్రధాన మార్గంపై కూటమి సర్కారు **నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా కాకినాడ డెయిరీ ఫారమ్ సెంటర్, దమ్ములపేట మీదుగా రైల్వే ట్రాక్ నుంచి పోర్టు రోడ్డుకు వెళ్లే దారిలో చాలా భాగం అధ్వానంగా మారింది. రైల్వే ట్రాక్ నుంచి కుంభాభిషేకం రేవు వద్ద కూడలి వరకూ పెద్ద పెద్ద** గొయ్యిలు ఏర్పడ్డాయి. అందులో ఇటీవల వర్షాలకు నీరు నిలిచిపోయింది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలపై ప్రయాణాలు సాగించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో బియ్యం నిల్వ చేసే గోదాములు, రుచి ఆయిల్ ఫ్యాక్టరీ, ఆయిల్ స్టోరేజ్ ట్యాంక్‌లు ఉండడంతో పోర్టుకు రాకపోకలు సాగించే లారీలు హెవీ లోడుతో రాకపోకలు సాగించడంతో రోడ్డు పూర్తిగా ఛిద్రంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణంపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు అంటున్నారు. తక్షణం రహదారిని పూర్తి స్థాయిలో నిర్మించేలా జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

### సంక్రాంతి ముందు హడావుడి పనులు

సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వచ్చేవారికి తమ పాలనలో రోడ్ల గుంతలు పూడ్చామని గొప్పలు చెప్పుకొనేందుకు ప్రచారం చేపట్టిన కూటమి సర్కారు సిటీ పరిధిలోని కుంభాభిషేకం రోడ్డు దుస్థితిని మాత్రం మార్చలేకపోయింది. పండుగ ముందు మమ అన్నట్టుగా రెండు రోజుల పాటు రాత్రి తారు కలిపిన కంకరను తీసుకువచ్చి చిన్నపాటి కొన్ని గతుకుల్లో వేసి, తరువాత విడిచిపెట్టారు. మరోవైపు కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో సుమారుగా 120 కిలోమీటర్ల మేర ఆర్ అండ్‌బీ, 50 కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్ రోడ్లు విస్తరించి ఉండగా.. ఆయా రహదారులలో గతుకులు పూడ్చివేత పూర్తిగా చేపట్టలేదు. కాకినాడ నుంచి పిఠాపురం వెళ్లే మార్గంలో సర్పవరం జంక్షన్ నుంచి అచ్చంపేట వరకు రోడ్డు మధ్యలో పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

#### ప్రయాణం కష్టమే..

పెద్ద పెద్ద గొయ్యిలతో నిండి ఉన్న కుంభాభిషేకం రోడ్డులో ప్రయాణం కష్టంగా మారింది. ఈ మార్గంలో పోర్టులో పనిచేసే కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు వెళ్తుంటారు. ఆరు నెలల కిందట కొన్ని గోతులు పూడ్చి విడిచిపెట్టారు. అవి మళ్లీ యథావిధిగా ఉన్నాయి.

-బి.నాగేశ్వరరావు, ప్రైవేట్ ఉద్యోగి

#### మత్స్యకారులకు అవస్థలు

చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ప్రమాదభరితంగా ఉన్న రోడ్డుపై వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ లోడుతో లారీలు ఎక్కువగా తిరుగుతున్నందున సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

-వి.కృష్ణ, మత్స్యకార సంఘ నాయకుడు, దుమ్ములపేట

### ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు


నిలిచిపోయిన వర్షం నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఇతర అధికారులు

**కరప:** స్థానిక మండల విద్యా వనరుల కేంద్రానికెళ్లే దారిలో వర్షంనీరు నిలిచిపోతుందని, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఈ సమస్యపై వస్తున్న ఫిర్యాదులకు ఎంపీడీఓ స్పందించి, మండల స్థాయి అధికారులతో కలసి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు అవతల ఉన్న డ్రెయిన్ మెరకగా ఉన్నందున, ఏం చేస్తే బాగుంటుందోనని అధికారులతో ఆమె చర్చించారు. నీరు పోయేలా డ్రెయిన్ నిర్మించేందుకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు తయారు చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజను ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్ అండ్‌బీ ఏఈఈ సాయిబాబారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్ ఏఈఈలు వీవీఎస్ వర్ధన్, నాగేష్, శైలజ, ఏఓ బీఎల్ నరసింహం, సునీల్, దుర్గాప్రసాద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్రలో భాగస్వాములుకండి


యోగా శిక్షణలో పాల్గొన్న సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున తదితరులు

**కాకినాడ సిటీ:** యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలోని మీడియా ప్రతినిధులకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. వివేకానంద పార్కులోని రెడ్‌క్రాస్ యోగా కేంద్రంలో ఆయుష్ యోగా గురువు రమా పల్లవి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్తలు కవర్ చేయడంలో విలేకరులు ఒత్తిడికి గురవుతుంటారన్నారు. దాని నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారం రోజుల పాటు ఉదయం 7.30 గంటల నుంచి 8.30 వరకూ మీడియా ప్రతినిధులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు.

## ఉద్యమంలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టండి


నగరంలో యోగా సాధన చేస్తున్న ప్రజలు

**కాకినాడ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమంలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల అధ్యాపకులతో యోగాంధ్ర-2025 కార్యక్రమానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, పాఠశాల విద్యాశాఖ అధికారి పి.రమేష్, ఇతర అధికారులు హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం విశాఖపట్నంలో యోగాంధ్రా పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకూ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని జేసీ కోరారు. యోగాంధ్రలో భాగంగా కాకినాడలో జూన్ 7న ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డీఆర్వో వెంకటరావు, ఆయుష్ వైద్య అధికారులు, హెచ్ సెక్షన్ విభాగ అధిపతి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

**యోగాపై అవగాహన**

కాకినాడలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ యోగాంధ్ర-2025లో భాగంగా మూడు లైట్ల జంక్షన్ నుంచి ఎండోమెంట్ భవనం రోడ్డు వరకూ యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక విభాగాధిపతులు, వార్డు సచివాలయ సిబ్బంది, యోగా ట్రైనర్లు, సుమారు 300 మందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. యోగా గురువు, ట్రైనర్లు యోగాసనాలు వేసి ప్రజలకు సులభంగా వివరించారు.

## సర్వేశ్వరా.. భీమేశ్వరా

### పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోటలో కుమారారామ భీమేశ్వరస్వామి

**సామర్లకోట:** స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయం, ఉపాలయాల్లో అర్చకులు పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

**వైభవంగా మదుగులమ్మ జాతర**

హుస్సేన్‌పురంలో మదుగులమ్మ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి కుటుంబంలో నైవేద్యాలు పెట్టుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య అమ్మవారి జాతర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కమిటీ సభ్యులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, గిరి, యవర్ణ అబ్బాయి, సత్తిబాబు, మార్ని హరి, మార్ని సురేంద్ర తదితరులు భక్తులకు సేవలందించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఘనంగా నేరేళ్లమ్మ జాతర**


కొమరగిరిలో నేరేళ్లమ్మతల్లి

**కొత్తపల్లి:** మండలంలోని కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చిరుతాడిని గరగ నృత్యాలతో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గత 15 రోజులుగా గ్రామంలో ప్రతి రోజూ గరగ నృత్యాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అమ్మవారి తీర్థాన్ని జరిపామన్నారు.

## జేఎన్‌టీయూకే కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు సోమవారం ఆందోళన బాట పట్టారు. ప్రతి ఏడాది మే నెలలో ఐదు రోజులు మాత్రమే ఉండే బ్రేకప్ పీరియడ్‌ను ఈ ఏడాది 14 రోజులకు కుదించారని, తద్వారా నెల వేతనం సగం వరకూ కోల్పోయామంటూ ఆవేదన చెందారు. అలాగే ఎన్నడూ లేని విధంగా సర్వీస్ రెన్యూవల్‌కు ఇంటర్వ్యూలు పేరుతో మళ్లీ కొత్త విధానం తీసుకువచ్చి మానసిక వేదనకు గురిచేస్తున్నారంటూ నినాదాలు చేశారు. దాదాపు 15 ఏళ్ల నుంచి 123 మంది అధ్యాపకులు కాంట్రాక్ట్ విధానంలో చేస్తున్నారని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటుండగా, ఇప్పుడు ఈ కొత్త విధానం ఏంటంటూ ప్రిన్సిపాల్ మోహనరావును నిలదీశారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఆందోళన రాత్రి 7 గంటల వరకూ రిజిస్ట్రార్, వీసీ చాంబర్ బయట కొనసాగింది. ఈ ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) మద్దతు పలికింది. కాంట్రాక్ట్ అధ్యాపకుల సేవలతో నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపు పొందటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని ఈ విధంగా ఆందోళనకు గురిచేయడం మంచిది కాదని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు అన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం జారీ చేసి జీఓ నంబర్ 110 ప్రకారం ఇంక్రిమెంట్ ఇవ్వడం లేదని, జీఓ నంబర్ 24 ప్రకారం మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### కుష్ఠు రోగులకు సాయం

**కాకినాడ సిటీ:** కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మే నెల కిట్లను జేఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హనోక్ సోమవారం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 370 మందికి ఈ సాయం చేశారు. బియ్యం, కిరాణా నిత్యావసరాలతో పాటు ప్రతి ఆరు నెలలకు ఇచ్చే ఎంసీఆర్, చెప్పులు, డాక్టర్లు సూచించిన వారికి వీల్ చైర్స్ పంపిణీ చేశారు. డాక్టర్ గ్లోరీ కాంత, డాక్టర్ జాకబ్ సుందర్‌లు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హనోక్ మాట్లాడుతూ కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, బొమ్మూరు, పెదబ్రహ్మదేవం, కాలేరు, అనపర్తి, నిడదవోలు, తుని తదితర ప్రాంతాలకు చెందిన లెప్రసీ రోగులకు మూడు దశాబ్దాలకు పైగా వైద్య, సామాజిక సేవలు అందిస్తున్నామన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతకు అభినందన


నిర్వాహకుల నుంచి గోల్డ్ మెడల్, మెమెంటో, సర్టిఫికెట్ స్వీకరిస్తున్న లిఫ్టర్ జగన్

**కరప:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం జరిగిన 3వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో కాకినాడ తరఫున పాల్గొన్న కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి జగన్ సత్తా చాటాడు. 66 కిలోల విభాగంలో పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రెండింటిలో గోల్డ్ మెడల్, స్ట్రాంగ్ మెన్ విన్నర్ (ఓవరాల్ చాంపియన్)గా నిలిచినట్టు లిఫ్టర్ జగన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన్ని సానా సతీష్‌బాబు స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ తలాటం హరీష్ అభినందించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ కరప గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు జగన్‌ను అభినందించారు.

## ప్రజల పక్షాన నిలిచి పోరాడుదాం..

### వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత


వంగా గీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

**పిఠాపురం:** సమస్యలపై ప్రజల పక్షాన నిలిచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పోరాడాలని, పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. సోమవారం పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆమెను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మత్స్యకార నాయకుడు కారే శ్రీనివాసరావు కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిష్ణాతులైన కార్యకర్తలు, నాయకులను అధ్యక్షులుగా నియమించడం ద్వారా పార్టీపై నాయకుల్లో నమ్మకం, విశ్వాసం పెంచినట్లవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పదవులతో నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించి ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో మంచి పట్టు ఉన్న నాయకుడు కారే శ్రీనివాసరావుకు పార్టీ జిల్లా స్థాయిలో పదవి ఇచ్చి ఆయనపై గురుతర బాధ్యతను ఇచ్చారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. మత్స్యకారుల చికాల కోరికైన ఉప్పాడ మేజర్ హార్బర్‌ను నిర్మించి వారి జీవన విధానం మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారన్నారు. తనపై పార్టీ పెట్టిన గురుతర బాధ్యతను శక్తివంచన లేకుండా నిలబెడతానని కారే శ్రీనివాసరావు తెలిపారు. ఒక్క వైఎస్ జగన్ హయాంలోనే మత్స్యకారులకు ఎక్కువ మేలు జరిగిందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతుల వాణి, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్ కుమార్, పాలాని దొరబాబు, సుబ్బారెడ్డి, ఎలీషా, జగన్నాథం, విష్ణుమూర్తి, ప్రసాదరెడ్డి, దివాకరరెడ్డి, హరిబాబు, కంబాల ఏకోబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సమైక్యతా ర్యాలీ



సమైక్యతా ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నగర కమిటీ నాయకులు

**కాకినాడ సిటీ:** ఏ మతమైనా, ఏ కులమైనా మనమంతా భారతీయులమే అంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం నుంచి ఇంద్రపాలెం వంతెన ఎదురుగా ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వరకూ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు, అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ విశిష్టత అని పేర్కొన్నారు. పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశమంతా కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడిందన్నారు. అయితే కేంద్ర పాలకులు మనదేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడం శోచనీయమన్నారు. బీజేపీ మంత్రులు, నాయకులు సైనిక అధికారుల పట్ల మాట్లాడుతున్న తీరు చాలా అభ్యంతరంగా ఉందన్నారు. పీఎం, ప్రభుత్వ పెద్దలు ఈ విషయంలో ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సమంజసంగా లేదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. ఉగ్రదాడిని ఆధారం చేసుకుని దేశంలో మత విభజన తీసుకురావాలని ప్రయత్నిస్తున్న స్వార్థపర శక్తులకు ప్రజలంతా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ర్యాలీలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సీపీఎం నాయకులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, కె.వీరబాబు, సీహెచ్ విజయ్‌కుమార్, జె.శేషు, ఎస్.వాసు, శ్రీకాంత్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.